గోల్కొండ ఏసీపీకి ఆహ్వానం



గోల్కొండ ఏసీపీకి ఆహ్వాన పత్రం అందజేస్తున్న సాయిబాబాచారి

గోల్కొండ: పూజలు, వ్రతాలు, ఉపవాస దీక్షలు మన సంస్కృతికి అద్దం పడతాయని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. అయ్యప్ప స్వామి పూజా ఆహ్వాన పత్రాన్ని బొమ్మల సాయిబాబాచారి మంగళవారం ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌కు అందజేశారు. ఈ నెల 19న జరిగే ఈ పూజా కార్యక్రమానికి తప్పకుండా రావాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..గోల్కొండ డివిజన్ మతసామరస్యానికి పెట్టింది పేరు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ మహంకాళీ ఆలయ పూజారి సురేష్‌చారి తదితరులున్నారు.

లలితాబాగ్‌లో జలమండలి అధికారుల పర్యటన



తాగునీటి సమస్యను అడిగి తెలుసుకుంటున్న జీఎం సంతోష్

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ డివిజన్‌లోని భయ్యాలాల్‌నగర్ బస్తీలో మంగళవారం జలమండలి జీఎం సంతోష్ పర్యటించారు. ఈ బస్తీలోని కొన్ని వీధుల్లో తాగునీటి పైప్‌లైన్ లేకపోవడంతో దశాబ్దాలుగా స్థానిక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక బీజేపీ నాయకుడు ఎర్రవెల్లి అశోక్‌రావు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల దాహార్తిని తీర్చేలా పైప్‌లైన్లు వేయాలని కిషన్‌రెడ్డి జలమండలి మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఆయన ఆదేశానుసారం జీఎం బస్తీలో పర్యటించి పైప్‌లైన్ ఎక్కడి నుంచి ఎక్కడి వరకు వేయాలి.. ఎన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయనే వివరాలను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. అంచనాలు రూపొందించి త్వరితగతిన బస్తీకి నీరందిస్తామని జీఎం ఈ సందర్భంగా స్థానికులకు హామీ ఇచ్చారు.

రోడ్డుకు మరమ్మతు చేయండి



జియాగూడ: జియాగూడ రహదారిలో అభివృద్ధి పనులు జరిగి నెలలు గడుస్తున్నా తిరిగి రోడ్డు మరమ్మతులు చేయలేదు. దీంతో రహదారి కుంచించుకుపోగా వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఇదిలా ఉండగా ద్విచక్ర వాహనదారులు తేలిక కంకర కారణంగా అదుపు తప్పి కిందపడి గాయాల పాలవుతున్నారు. అలాగే సోమవారం నుంచి జియాగూడ రంగనాథ ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు ఆలయానికి భక్తుల తాకిడి ఉంటుంది. ఆలయం ముందు నుంచి కుల్సుంపురా 2జే బస్టాండ్ వరకు వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో తూర్పు రామిరెడ్డి, కృష్ణ

అఫ్జల్‌గంజ్: ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భారతీయ మజ్దూర్ సంఘ్ దక్షిణ మధ్య కార్యదర్శి దుర్గైరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రామిరెడ్డి, నగర అధ్యక్షుడు టి.కృష్ణ అన్నారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ పలు ప్రాంతాల్లోని కార్మికులను కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మంగళవారం పలు పార్కుల వద్ద కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాగమణి, రూపేష్, పవన్, జయకిషన్, యాదయ్య, ఆర్.వెంకటేష్, రసూల్, బిక్షపతి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో రాహుల్‌దాస్‌బాబా, దేవేందర్‌రెడ్డి



ఊరేగింపులో కాషాయ జెండాలతో నృత్యాలు



అయోధ్య రాములోరికి బంగారు పాదుకలు

దేశంలో మొదటిసారిగా శ్రీరామ దీక్ష మాలధారణ ప్రారంభం

- అయోధ్య రామయ్య కోసం 17 కిలోల బంగారు పాదుకలు
- సంగం ఆలయం నుంచి అయోధ్యకు పాదయాత్రగా తరలిన భక్తులు



పల్లకిలో బంగారు పాదుకలు మోసుకెళుతున్న రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: జై శ్రీరామ్..జై జై శ్రీరామ్..అంటూ అయోధ్య రామయ్య నామస్మరణతో లంగర్‌హౌస్ ప్రాంతం మార్మోగింది. లంగర్‌హౌస్ త్రివేణి సంగం రామచంద్రజీ మఠం వేదికగా ప్రారంభమై అయోధ్యకు శ్రీరామ దీక్ష మాలధారణ భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. రామరాజ్యం ఫౌండేషన్ కృషితో అయోధ్య రామునికి సమర్పించేందుకు 17 కిలోల బంగారు పాదుకలు తయారు చేయించారు. దేశంలో ఎక్కడ లేని శ్రీరామ దీక్ష మాలధారణను ప్రారంభించారు. భక్తులు మాలధారణ స్వీకరించి పాదయాత్రగా తరలివెళ్లారు. ఇందులో భాగంగా పండితులు సురేష్ ఆత్మారామ సమక్షంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా, రామరాజ్యం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నంగి దేవేందర్ రెడ్డి రాములోరి బంగారు పాదుకలకు పూజలు నిర్వహించారు. అనంతరం డీజే పాటలతో కాషాయ జెండాలు చేతబట్టి నృత్యాలు చేస్తూ పాదయాత్రను ప్రారంభించగా దారిపొడవునా భక్తులు హారతులు పడుతూ స్వాగతం పలికారు. ఈ ఊరేగింపులో నాయకులు తోకల శ్రీనివాస్‌రెడ్డి, భద్రాద్రి ఆలయం నిర్మించిన కంచర్ల గోపన్న మునిమనవడు కంచర్ల వెంకటరమణ, ఇంద్రసేనారెడ్డి, లింగారెడ్డి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ నాగేష్, ముత్యాల శేఖర్ బాబు, వాసగిరి నాగరాజ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నాంపల్లి: గోషామహల్ నియోజకవర్గం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధ్యక్షుడిగా కల్యాణ్ సందేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి అల్లోల రమేష్ మంగళవారం నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కల్యాణ్ సందేశ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి నియోజకవర్గం అధ్యక్షుడిగా నియమించినందుకు ఆ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పి.వై.గిరి మహారాజ్, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి అల్లోల రమేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోను సాల్మన్, యాకుత్‌పురా అధ్యక్షుడు రవి కిషన్, బీఎస్పీ సీనియర్ నేతలు ఆధారి రాజేష్, జీసీ శేఖర్ రావు, రామ్‌చందర్, రాకేష్, తూంకుంట్ల జై కుమార్, శ్యామ్ బాంగ్డి, కల్యాణి గంగమ్మ, అత్తాపూర్ లత, అత్తాపూర్ రాజు, నాగేశ్వరి, రిషి పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



హకీంపేట్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని ఎస్ఎస్ఎఫ్ కాలనీ, హకీంపేట్, కాళీబంగ్లా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి ప్రజల మధ్యలోనే ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నానన్నారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరించడంతో పాటు బస్తీల్లో సమస్యలు పునరావృతం కాకుండా చూస్తున్నానని ఆయన అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అధునాతన డ్రైనేజీ నిర్మాణం పనులు పూర్తి దశలో ఉన్నాయని ఈ పనులు పూర్తి అయితే ఎక్కడ కూడా రోడ్లపై మురుగు ప్రవాహం కానరాదని ఆయన అన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆలీ ముద్దీన్ తదితరులున్నారు.

నేటి చలో రాజ్‌భవన్‌కు భారీగా తరలిరావాలి



వెంకటేశ్

గౌలిపురా: గౌతం అదానీ, మణిపూర్ అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 11 గంటలకు నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు ప్రదర్శనగా చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు.

వ్యాయామశాలలో కొత్త బెంచీలు ప్రారంభం

గౌలిపురా: గౌలిపురా మిత్రా క్లబ్ వ్యాయామశాలలో మంగళవారం నూతనంగా తయారు చేసి మెటీరియల్, బెంచీలను మిత్రా క్లబ్ వ్యాయామశాల అధ్యక్షుడు ఆర్.సూర్యప్రకాశ్ పూజలు నిర్వహించి ప్రారంభించారు. బెంచీల తయారీదారులు కె.దుర్గారాజ్, గౌరీ శంకర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వ్యాయామశాల ప్రధాన కార్యదర్శి ఎ.కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాలు



బహుమతులతో బీపీడీఏవీ పాఠశాల విద్యార్థులు

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని మిశ్రా ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)లో స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. దేశ వ్యాప్తంగా స్వచ్ఛతా పఖ్వాడా ప్రచారంలో భాగంగా పరిశుభ్రత, పర్యావరణ, సుస్థిరత, సామాజిక బాధ్యతను ప్రోత్సహించడానికి మిధాని కంపెనీ ప్లాంట్, కార్పొరేట్ కార్యాలయం, ఉద్యోగుల నివాస గృహ సముదాయంలో అనేక పరిశుభ్రత కార్యకలాపాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మిధాని బీపీడీఏవీ పాఠశాలలో వ్యాసరచన, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మిధాని హెచ్ఆర్ జీఎం ఎ.రామకృష్ణ రావు, ఏజీఎం వి.హరికృష్ణ, సెక్యూరిటీ, ఈఎంఎస్ అండ్ సీఓఈ డీజీఎం ఎన్.శేషగిరి రావు, హెచ్ఆర్ ఎస్ఎం ఆర్.రష్మి, కార్పొరేట్ కమ్యూనికేషన్ అండ్ హిందీ సెల్ మేనేజర్ డాక్టర్ బి.బాలాజీ పాల్గొన్నారు.

శాస్త్రీయ కళలను కాపాడుకుందాం



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ సంగీత నృత్య కళలను కాపాడుకుందామని తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సుస్వర వాహిణి సాంస్కృతిక కళాసంస్థ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రమణ్యం సినీ సంగీత విభావరి, శాస్త్రీయ నృత్య ప్రదర్శనల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొండాపూర్‌కు చెందిన రాజేష్ డ్యాన్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. అదేవిధంగా పలువురు గాయని గాయకులు ఆలపించిన గీతాలాపన అలరించింది. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు మాదవపెద్ది సురేష్, ఎస్‌బీఐ అధికారి గరికపాటి వెంకట్, సంస్థ అధ్యక్షుడు అమీన్ పాషా పాల్గొన్నారు.

యువత కవిత్వంపై ఆసక్తి పెంచుకోవాలి



కవిత్వ అధ్యయన శిబిరంలో కవులు, విమర్శకులు

సుల్తాన్‌బజార్: యువత కవిత్వంపై ఆసక్తి పెంచుకోవాలని ప్రముఖ కవులు, విమర్శకులు సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం కవిత్వ అధ్యయన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ తరాలు మారుతున్నకొద్దీ కవి మార్గం కూడా మారాలని కవిత్వాన్ని అనుభావాల నుంచి చేదుకోవాలని సూచించారు. సాహిత్య అకాడమి పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి ప్రధానోపన్యాసం చేస్తూ జానపద కళారూపాల్లో కూడా కవిత్వం ఉంటుందని ఒగ్గు కథలోని కొన్ని పంక్తులను ఉదహరించారు. అధ్యయనం లేకుండా కవిత్వానికి పరిపూర్ణత లేదని, కవికి ఉత్సాహం తీసుకున్న అంశంపై అంకిత భావం చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాంచనపల్లి గోవర్ధనరాజు, ప్రముఖ కవి డాక్టర్ యాకూబ్, డాక్టర్ పసునూరి రవీందర్, పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, డాక్టర్ గంగాప్రసాద్‌లతో పాటు తదితర కవులు శిబిరంలో పాల్గొన్నారు.

ఉద్యోగుల మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



టీఎన్జీఓస్ క్రీడా వేడుకల్లో మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఉద్యోగుల మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడుతాయని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. ఎప్పుడూ విధుల్లో బిజీగా ఉండే ఉద్యోగులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు ఈ క్రీడా పోటీలు ఉపయోగపడుతాయన్నారు. బి.స్వామినాథం 11వ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం మారం జగదీశ్వర్, ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్ గగన్ మహల్ మైదానంలో ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ..నగరంలోని పలు శాఖల్లో ఉన్న ఉద్యోగుల సంక్షేమం, ప్రగతి, అభివృద్ధి కోసం తమ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఐదు రోజుల పాటు ఉద్యోగుల కోసం ఆటపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. టీఎన్జీఓస్ కేంద్ర, నగర నాయకులు కేఆర్.రాజ్‌కుమార్, విక్రమ్‌కుమార్‌లతో పాటు సత్యనారాయణ గౌడ్, కె.రామిరెడ్డి, లెక్చరర్ విద్యాసాగర్, కొండల్‌రెడ్డి, హరికృష్ణ, గడ్డం జ్ఞానేశ్వర్, ఉమర్‌ఖాన్, శ్రీనివాస్, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



యాకుత్‌పురా: ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా స్థానిక వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ తెలిపారు. మంగళవారం ఆయన బీబీ బజార్ చౌరస్తా నుంచి తలాబ్‌కట్టా ఈది బజార్ రైల్వే బ్రిడ్జి, అలిజాకోట్లా నుంచి దారుషిఫా వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. స్థానిక పత్తర్‌గట్టీ కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రీతో కలిసి మీరాలంమండి, పురానీహవేలీ ప్రాంతాల్లో పర్యటించి రోడ్లపై అక్రమ పార్కింగ్ చేయకుండా పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ..దారుషిఫా, ఎంజీబీఎస్, సాలార్‌జంగ్ మ్యూజియం, పురానీహవేలీ, ఎత్తేబార్ చౌక్, యాకుత్‌పురా, బీబీ బజార్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రేపు సెలక్షన్ ట్రయల్స్

గౌలిపురా: ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జనగాం డిస్ట్రిక్ట్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలురు 50వ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ చాంపియన్‌షిప్–2024 పోటీలకు 19న సెలక్షన్ ట్రయల్‌ను నిర్వహించనున్నట్లు హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కబడ్డీ అసోసియేషన్–2 అధ్యక్షుడు ఎం.మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింగ్ రావు, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కబడ్డీ అసోసియేషన్–1 అధ్యక్షుడు బి.శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సి.విజయ్ కుమార్ యాదవ్ తెలిపారు. 19న మధ్యాహ్నం 3 గంటల లోపు ఎల్‌బీ స్టేడియంలో వేదిక వద్ద రిపోర్ట్ చేయాలన్నారు. ఈ ట్రయల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 70 కిలోల బరువు మించకూడదన్నారు.

తెలంగాణలో నిరంకుశ పాలన



నిరసన కార్యక్రమంలో జీవన్‌సింగ్ తదితరులు

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నిరంకుశ పాలన కొనసాగిస్తుందని కార్వాన్ సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు టి.జీవన్‌సింగ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌సింగ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలన పదేళ్లల్లో తెలంగాణ సస్యశ్యామలంగా ఉందని రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి నిరంకుశ విధానాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయం మేరకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరుగుతున్న కార్యక్రమాలను మరింత ముమ్మరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ.శేఖర్‌రెడ్డి, రఘు, శ్రీధర్‌సాగర్, కె.నరేందర్, వనం హరి, సత్యనారాయణ, రంగారెడ్డి, వెంకటరమణ, అనిత, సుకన్య తదితరులున్నారు.

ఎగ్జిబిషన్‌ను సందర్శించిన ఫైర్‌సేఫ్టీ అధికారులు



అబిడ్స్: హైదరాబాద్ డీఎఫ్ఓ వెంకన్న ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్‌ను అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఫైర్‌సేఫ్టీని పరిశీలించారు. అనంతరం డీఎఫ్ఓ వెంకన్న మాట్లాడుతూ..జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎగ్జిబిషన్‌లోని ఫైర్ వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా వలంటీర్లు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా శిక్షణ చేపడతామన్నారు.

ప్రసన్న కిరణ్‌కు సత్కారం



అబిడ్స్: ప్రముఖ రచయిత, కవయిత్రి బీచ ప్రసన్న కిరణ్‌ను కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పలు కవితలు, రచనల ద్వారా ప్రతిభను చాటిన ప్రసన్న కిరణ్‌ను డాక్టర్ రాధ కుసుమ సత్కరించి ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రసన్న కిరణ్ మాట్లాడుతూ.. వినూత్న తరహా కవితలను నిరంతరం రచిస్తానని పేర్కొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి

గన్‌ఫౌండ్రీ: సమాజంలో విస్మృతికి గురైన తొలితరం కథల సాహిత్యాన్ని ఈ తరానికి పరిచయం చేస్తూ పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిధారెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఆధ్వర్యంలో రచయిత కేపీ.అశోక్‌కుమార్ రచించిన తొలితరం కథలు–కథన రీతులు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ తొలితరం కథకులు 30 మందిని స్థూలంగా పరిచయం చేయడమే కాకుండా వారి కథలు, కథన రీతుల గురించి విశ్లేషించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, వీక్షణ సంపాదకులు ఎన్.వేణుగోపాల్, పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు కె.ఆనందాచారి అనంతోజ్ మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.